

# మాటతీరు

వైకుంఠాన్ని చూడగానే వైదేహి మొహం చాటంత అయిపోయింది. అతనొచ్చాడంటే తన కూతురికేదో ఒక సంబంధం పట్టుకొస్తాడు. అది ఆమె సంబరానికి కారణం.

"రండి....రండి....." మర్యాదలొలకబోస్తూ గేటు తీసింది.

"సత్యమూర్తి గారు" గొణుగుతున్నట్లుగా అన్నాడు వైకుంఠం.

"ఇంట్లోనే ఉన్నారు కూర్చోండి"

"పెళ్లి వారొచ్చేస్తున్నారు. అమ్మాయిని ఎంత త్వరగా సిద్ధం చేస్తావో మరి. పట్టుకొచ్చింది ఆషామాషీ సంబంధం కాదు. అబ్బాయి ఆంధ్రాబ్యాంక్‌లో ఆఫీసరు."

"అలాగా! ఇదుగో అయిదు నిమిషాల్లో...."

"అది సరే, ఈ మారైనా మీ ఆయన్ని కాస్త కంట్రోల్ చేస్కో తల్లీ. లేకుంటే ఇది కూడా పుసిగి పోగలదు. మళ్లీ మళ్లీ సంబంధాలు తేవడం నావల్ల కాదు" అన్నాడు వైకుంఠం.

"మీకా బెంగేం అక్కర్లేదు. ఆయన పెళ్లివారి ఎదుటే పడరు సరేనా? పిల్లా

పిల్లోడు నచ్చుకోనడమంటూ జరిగితే అన్ని విషయాలు మీరే మాట్లాడెద్దరుగాని" భరోసా ఇచ్చింది వైదేహి.

మాటల్లో వచ్చారు పెళ్లివారు.

క్షణాల మీద కూతుర్ని ముస్తాబు చేసి తీసుకొచ్చింది వైదేహి.

కాస్సేపు నిశ్శబ్దం.

"మీకు పిల్ల నచ్చితే చెప్పండి. తతిమా విషయాలు మా వైకుంఠం గారు మాట్లాడుతారు" అన్నది వైదేహి.

కొడుకు వంక చూసాడు కైలాసం.

నచ్చుకున్నట్లు తల పంకించాడు పెళ్ళి కొడుకు.

"ఇంతకు బావగారేరి, ఎక్కడా కనిపించరేం?" దిక్కులు చూస్తూ అడిగాడు కైలాసం.

"వస్తారు. సంధ్య వార్చే కార్యక్రమంలో ఉన్నారు. ఈలోగా కట్న కానుకలు మాట్లడేసుకుంటే బావుంటుంది. నా మాటే ఆయన మాట. మీకా డౌటేం అక్కర్లేదు" తొందరపెట్టాడు వైకుంఠం.

"పెళ్లి పెద్ద లేకుండానా?" నివ్వెరపోతున్నట్లుగా అన్నాడు కైలాసం.

ఇహ లాభం లేదనుకుని సవాలక్ష హెచ్చరికలు చేసి భర్తను లాక్కొచ్చింది వైదేహి.

అన్నింటికీ తల ఆడించి వచ్చి బుద్ధిగా కూర్చున్నాడు సత్యమూర్తి.

"ఎడం చేతికి ఆ కట్టేమిటండీ? యాక్సిడెంటా?" నోరు వెళ్ళబెడుతూ అడిగాడు కైలాసం.

మాట్లాడలేదు సత్యమూర్తి.

నీళ్ళు నమిలాడు వైకుంఠం.

"కుక్క కరిచింది" అన్నది వైదేహి.

ఆ మాటకు అంతా ఆశ్చర్యపోయారు. ఉక్కులా ఉన్న సత్యమూర్తిని కుక్కే కాదు. ఇలలో ఏ జంతువు కరిచే సాహసం చేయలేదు. మరి ఈవిడగారేంటి ఇలా అంటోంది అనుకున్నారు. నిజం చెబితే విడ్డూరంగా ఉంటుంది. అతన్ని కరిచింది. శునకం కాదు. సాక్షాత్తూ ఆయన భార్యామణే. వాస్తవాన్ని వెల్లడించే ధైర్యం లేక తను చేసిన పాపాన్ని కుక్క మీదకు నెట్టింది వైదేహి.

"అమ్మాయి మాకు నచ్చింది. ఇక మీ పెట్టుపోతలేమిటో సెలవిస్తే...." అన్నాడు కైలాసం సత్యమూర్తి వంక చూస్తూ.

"మీ ఇష్టప్రకారమే అన్నీ జరుగుతాయి" తపేమని అన్నాడు వైకుంఠం.

"అన్నీ మీరే మాట్లాడేస్తున్నారు ఆయన్ని నోరు విప్పనివ్వండి" కించిత్ చిరాకు ప్రదర్శించాడు కైలాసం.

దాంతో నోరు విప్పక తప్పింది కాదు, సత్యమూర్తికి.

వైదేహి గుండె దడదడలాడింది.

"పెళ్ళికి ముందు మా పిల్ల గురించి చాలా విషయాలు చెప్పాలి. కానీ వీళ్లెవరూ నన్ను మాట్లాడనివ్వకుండా నా మూతికి ప్లాస్టరేశారు" అన్నాడు సత్యమూర్తి.

పెనిమిటి వంక ఎర్రగా చూసింది వైదేహి.

"ఫరవాలేదు. మీరు చెప్పదలచుకున్నదేదో నిర్భయంగా చెప్పండి" అన్నాడు కైలాసం.

"క్షమించండి. నన్ను నోరు మెదపవద్దని హోమ్ డిపార్ట్‌మెంట్ ఆర్డరు వేసిన తర్వాత దానిని ఉల్లంఘించే ప్రసక్తే లేదు" ఖండితంగా చెప్పాడు సత్యమూర్తి.

"ఇంటి యజమాని వట్టి వెర్రిబాగులాడులా ఉన్నాడు. తన కూతురు గురించి ఏదో చెప్పాలనుకుంటూ ఉంటే వీళ్ళంతా అతడి నోరు నొక్కేస్తున్నారు. నాకేదో అనుమానంగా ఉందండి" భర్త చెవి కొరికింది సుభద్రమ్మ.

ఆ మాటతో లేచి నిలబడ్డాడు కైలాసం.

వైకుంఠం ఏదో అనబోతే "పిల్లను చూశాం కదా ఆలోచించుకుని ఉత్తరం రాస్తాం" అన్నాడు.

వైకుంఠం మొహం మాడిపోయింది.

సంబంధం ఖాయమైనట్లే అయి చేజారిపోవడంతో ఏడుపొచ్చింది వైదేహికి. కూతురు భవిష్యత్తుకు కన్న తండ్రి అవరోధం కావడం భరించలేకపోతోంది. గతంలోనూ ఇలాగే అతగాడి నిర్వాకంతో ఎన్నో సంబంధాలు తప్పిపోయాయి.

ఓమారు పెళ్ళిచూపుల్లో పెళ్లి కొడుకు తండ్రి ఆ మాట ఈ మాట అంటూ అమ్మాయి వయసెంత అని అడిగాడు.

"మగవాడి జీతం, ఆడదాని వయసు అడక్కూడదన్నారు బావగారూ!" అన్నాడు సత్యమూర్తి.

"మగవాడి వయసు కంటే ఆడపిల్ల వయసు ఎక్కువైతే కట్టుకున్న వాడికి ఆయుక్షీణమంటారు. పిల్ల వయసు చెప్పడానికి మీకు గల అభ్యంతరమేమిటో మాకర్థం కావడం లేదు" అంటూ లేచారు పెళ్ళివారు.

సత్యమూర్తి అసందర్భ ప్రేలాపనతో ఇలాగే మరో సంబంధం కూడా

పుసిగిపోయింది.

"ఎంతవరకు చదువుకున్నావమ్మా?" అని కాబోయే అత్తగారు అడిగితే "ఇంటర్ పాసయ్యానండి" అంటూ నమ్రతగా జవాబిచ్చింది అనూరాధ.

అయితే సత్యమూర్తి మాత్రం ఊరుకోకుండా దానినే పట్టుకుని సాగదీస్తూ "కాలేజీల్లో చేర్పిస్తే ఆడపిల్లలు ప్రేమా గీమా అంటూ మన మాట మరి వినరు. ముల్లొచ్చి ఆకు మీద పడ్డా, ఆకొచ్చి ముల్లు మీద పడినా ఆకుకే కదండి నష్టం. అందుకే "పిల్ల చదువును ఇంటర్‌తోనే ఫుల్‌స్టాప్ పెట్టించేశాను" అన్నాడు ఏదో ఘనకార్యం చేసినట్లు.

ఆ మాటకు పిల్ల మీద ఏం డౌటొచ్చిందో తెలీదు...ఇంటికెళ్ళాక కబురు చేస్తామన్నారు.

"మీకు మాట్లాడ్డం చేతకాకపోతే నోరు మూసుక్కూర్చోండి. అంతేతప్ప అడ్డదిడ్డంగా వాగొద్దు" అంటూ కోడెత్రాచయింది వైదేహి.

ఆ మధ్య పెళ్లి కొడుకు తరఫున వచ్చిన బంధువులు "ఏమ్మా, ఎలానూ ఇంటర్ పాసయ్యావు కదా టి.టి.సి. చేయలేకపోయావా" అని అడిగితే జవాబుగా నవ్వి ఊరుకుంది అనూరాధ.

అయితే సత్యమూర్తి కలుగజేసుకుంటూ "మగవాడు తిరక్క చెడితే, ఆడది తిరగి చెడిందన్నారు. ఉద్యోగం పేరుతో నా కూతుర్ని ఊరిమీదకు ఉసిగొలపలేను" అన్నాడు.

అతడి మాటల్ని ఎలా అర్థం చేసుకున్నారో తెలీదు మరి ఆ ఇంటి వంక చూడలేదు పెళ్ళివారు.

సత్యమూర్తి మూలంగా వచ్చిన ప్రతి సంబంధం చెడిపోతూ ఉండడంతో భద్రకాళి అయింది వైదేహి.

అతడేదో అన్నాడు.

ఆమె ఏదో అంది.

మాట మాట పెరిగింది.

ఉక్రోషం అణచుకోలేక భర్త చేతిని కొరికేసింది వైదేహి.

"అమ్మో రక్తం" హడలిపోయి హాస్పిటల్‌కు లంఘించాడు సత్యమూర్తి.

ఈ మారు భర్తనేమీ అనలేక "మీ నాన్నకి నువ్వే చెప్పాలే తలా తోకా లేని మాటలతో సంబంధాలు చెడగొట్టొద్దని" అంటూ కూతుర్ని బ్రతిమలాడింది వైదేహి.

"అవేం మాటలమ్మా నేను బాగుండాలని నాన్నకు మాత్రం ఉండదా? అనవసరంగా మీరాయన్ని అపార్థం చేసుకుంటున్నారు" అంది అనూరాధ.

కూతురు కూడా తండ్రినే సమర్థించడంతో వళ్ళు మండిపోయింది వైదేహికి.

"అమ్మా! ఇహ నీ కూతురికి సంబంధాలు చూడడం నా వల్ల కాదు. నాకు సెలవిప్పించు" అన్నాడు వైకుంఠం చేతులు జోడిస్తూ.

ఆ మాటకు వైదేహి మరింత దిగాలుపడిపోతూ "అలా అంటే ఎలా చెప్పండి?" అంటూ కంటతడి పెట్టింది.

"మీ అమ్మాయికి పెళ్ళవ్వాలంటే నాకు ఒక్కటే మార్గం కనిపిస్తోంది" అన్నాడు వైకుంఠం ఆమె అవస్థకు జాలిపడుతూ.

ఆశగా చూసింది వైదేహి.

"చూడమ్మా నువ్వు, నేను కడకు ఆ దేవుడు కూడా సత్యమూర్తి గారి మాట తీరును మార్చలేం. చూస్తున్నావు కదా అతని మూలంగా ఎన్ని సంబంధాలు తప్పిపోయాయో. అందుచేత నా మాట విని మేనరికాన్ని కలుపుకో. దగ్గరి వాళ్ళు కాబట్టి సత్యమూర్తిగారు ఏమన్నా అపార్థం చేసుకునే అవకాశం ఉండదు."

"అంతేనంటారా?" దీనంగా ముఖం పెడుతూ అన్నది వైదేహి.

"అంతేనమ్మా! ఈ పరిస్థితుల్లో అంతకన్నా మనం చేయగలిగిందేమీ లేదు" అంటూ చేతులెత్తేశాడు వైకుంఠం.

అతడు చేసిన ప్రతిపాదనకు కూతురి వంక విజయగర్వంతో చూశాడు సత్యమూర్తి.

బదులుగా సన్నగా నవ్వింది అనూరాధ.

సత్యమూర్తికి తన కూతుర్ని అక్క కొడుక్కి ఇవ్వాలని ఉంది. పైగా అనూరాధ కూడా బావనే ఇష్టపడుతోంది. ఎటొచ్చీ వైదేహికి మాత్రం మేనరికం కలుపుకోవడం ఇష్టం లేదు. ఒకసారి మాటల సందర్భంలో సత్యమూర్తి తన అభిప్రాయాన్ని వెల్లడించినప్పుడు వైదేహి ఆ ప్రతిపాదనను తీవ్రంగా ప్రతిఘటించింది. అంతేకాదు. బావతో అనూరాధ పెళ్లి జరిగితే నూతిలో దూకుతానంది. ఆమె అభీష్టానికి భిన్నంగా ప్రవర్తిస్తే ఆమె అన్నంతపని చేసి తీరుతుంది. అందుకే అప్పటి నుంచి మరి మేనరికం ఊసెత్తడం మానేసి తనమాట తీరు మార్చుకున్నాడు.

వచ్చిన ప్రతి సంబంధం తప్పిపోతూ ఉండడంతో దిక్కుతోచని స్థితిలో ఇప్పుడు వైకుంఠం చేసిన సూచనపై దృష్టి సారించింది వైదేహి.

**(26 మే 2002 ఆంధ్రప్రభ, డైలీ)**